రాష్ట్రవ్యాప్తంగా కొత్త బస్సుల ఏర్పాటుకు చర్యలు

ఆర్‌టిసి ఎమ్‌డీ ద్వారకాతిరుమల రావు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రవ్యాప్తంగా 2,500 కొత్త బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావు తెలిపారు. పట్టణంలో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, ఆర్‌టిసి డిపో మేనేజర్ పవన్ కుమార్ సాధర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆర్‌టిసి స్థితిగతులపై పరిశీలన కొనసాగించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ 1,500 డీజిల్ బస్సులు కొనుగోలు చేయడంతో పాటు 200 డీజిల్ బస్సులను ఎలెక్ట్రికల్ బస్సులుగా మారుస్తున్నామన్నారు. మరో 800 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేస్తున్నామని, మొత్తం 2,500 బస్సులు విడతల వారీగా రాష్ట్రంలోని అన్ని డిపోలకు పంపడం జరుగుతుందని తెలిపారు.

కరువు పై.. కళ్లు తెరిచేనా..!

ఎండిపోయిన వరి పంటను చూపుతున్న నేతలు

- వర్షాల్లేక నీటిఎద్దడితో పంటలపై పెను ప్రభావం
- వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నా పట్టని అధికారులు
- కరువు మండలాల ఎంపికలో తీవ్ర నిర్లక్ష్యం
- పంటను కోల్పోయి, ఉపాధి లేక సమస్య తీవ్రతరం
- ప్రజాప్రతినిధుల మౌనంపై జనం తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వర్షాభావంతో వేలాది ఎకరాలకు సాగు నీరందక పంటలు దెబ్బతిన్నా జిల్లా అధికార యంత్రాంగం కళ్లుతెరవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరువు మండలాల జాబితాలో జిల్లాలో ఏఒక్క మండలం లేకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా కనిపిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం నాలుగు నెలల్లో మూడునెలలు సరిగ్గా వర్షాలు కురవలేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో పంట పొలాలు ఎండిపోవడంతో పశువుల మేతగా మారడం కళ్లముందే కన్పిస్తోంది. భూగర్భ జలాలు తగ్గి బోర్ల నుంచి నీరు రాకపోవడం స్పష్టంగా తెలుస్తోంది. ఒక్క చింతలపూడి మండలంలోనే ఐదు వేలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతుల లెక్కలు చెబుతున్నాయి. కృష్ణా డెల్టాలో ఆయకట్టుకు సాగు నీరందక పొలాలు బీటలు వారాయి. ఏలూరు జిల్లాలో 27 మండలాలుండగా దాదాపు పది మండలాల్లో తీవ్ర నీటిఎద్దడి సమస్య ఏర్పడింది. చెరువులన్నీ అడుగంటాయి. బోర్ల నుంచి సరిగా నీరు రావడం లేదు. అయినప్పటికీ కరువు మండలాల జాబితాలో జిల్లాలో ఒక్క మండలానికి కూడా చోటు దక్కలేదు. కరువు కమ్మేయడంతో పంటలు దెబ్బతినడం, ఉపాధి సైతం లేకపోవడంతో జనం అల్లాడుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా వేలాది ఎకరాల్లో పంట చేతికందే పరిస్థితి లేకుండాపోయింది. ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతిందో అధికారులు చెప్పకుండా దాచేస్తున్న పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు సైతం రైతులను గాలికొదిలేశారు. ఎండిన పంట పొలాలనుగాని, కష్టాల్లో కూరుకుపోయిన రైతులనుగానీ పరామర్శించే నాధుడే లేకుండాపోయాడు. ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడి పెట్టి సర్వం కోల్పోయిన రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉంది. కరువుపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహించారో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. కరువు లేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. కళ్లముందే సమస్య కన్పిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటనే ప్రశ్నలు అందరినీ తొలిచేస్తున్నాయి. ద్వారకాతిరుమల, కామవరపుకోట వంటి మండలాల్లోనూ తీవ్ర దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

దెబ్బతిన్న పంటలపై లెక్క తేల్చండి

ఇప్పటి వరకూ నీటి ఎద్దడి సమస్యతో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన లెక్కల వివరాలు అధికారులు ఎందుకు బయట పెట్టడం లేదని రైతులు, రైతుసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రాథమిక అంచనాలు తయారు చేశారా, లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. కళ్ల ముందే పంటలు దెబ్బతిని పనికిరాకుండా పోయినా ఎందుకు పంట నష్టం నమోదు చేయడం లేదనే ప్రశ్నలకు సమాధానాలు లేకుండాపోయాయి. కరువు మండలాలపై ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపించారా అని రైతులు అడుగుతున్నారు. అధికారులు పంపించిన నివేదిక వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల సమస్యలు అధికారులకు ఎందుకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరువుపై అధికారికంగా ప్రకటన చేయాలని, ఎందుకు కరువు ప్రాంతాలను గుర్తించలేదో చెప్పాలని అంతా డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి లేకుండా అల్లాడుతున్న రైతులు, రైతు కూలీలను ఏవిధంగా ఆదుకుంటారో చెప్పాలని ఆవేదన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలపై వ్యవసాయాధికారులు ఎందుకు నోరువిప్పడం లేదనేది అందరికీ అంతుబట్టని ప్రశ్నగా మారిపోయింది. కరువు పరిస్థితులు జిల్లాలో లేవని చెప్పడానికి అధికారులు ఏవిధంగా అంచనాలు తయారు చేశారో రైతులకు తెలియజెప్పాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కరువుపై కళ్లు తెరిచి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అంతా కోరుతున్నారు.

సబ్ ట్రెజరీలో ఏసిబి తనిఖీలు

- రూ.41,380 అనధికార సొమ్ము గుర్తింపు
- రాత్రి వరకూ కొనసాగిన తనిఖీలు, విచారణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏసిబి డిఎస్‌పి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని కోటదిబ్బ ప్రాంతంలో సబ్ ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కార్యాలయంలో కార్యాలయ సూపరింటెండెంట్‌తోపాటు మొత్తం తొమ్మిది మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. తనిఖీలు రాత్రి వరకూ కొనసాగాయి. ఈ తనిఖీల్లో అనధికారికంగా వివరాల్లేని రూ.41,380 సొమ్మును ఏసిబి అధికారులు గుర్తించారు. ఈ నగదు మొత్తం ఎక్కడిదనే అంశంపై వారు విచారణ చేస్తున్నారు. విచారణ అనంతరం ఏసిబి అధికారులు తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

కబడ్డీ క్రీడాకారులకు బూట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు, బూట్లు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కబడ్డీ క్రీడా జట్టుకు ఆ కళాశాల విశ్రాంత పీడీ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ క్రీడా దుస్తులు, బూట్లు వితరణ చేయడం అభినందనీయమని ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం తరుపున నారాయణపురం క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ క్రమంలో పేద క్రీడాకారులకు క్రీడాదుస్తులు, బూట్లు అందించి వారిని ప్రోత్సహించడం గర్వకారణంగా ఉందని, తనలో ఇంకా క్రీడా స్ఫూర్తి ఉందని విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

డెంగీ బాధితులకు వైద్యం అందించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

డెంగీ బాధితులకు వైద్య సదుపాయం అందించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు తెలిపారు. భువనపల్లి పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌కి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం, ఇందిరమ్మ కాలనీ, జగ్గయ్య చెరువు, గాంధీ నగర్ ప్రాంతాలలో డ్రెయినేజీల్లో మురుగునీరు నిలువ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రతీ ఇంటిలో ఇద్దరూ లేక ముగ్గురు చొప్పున సుమారు 200 మంది గతనెల రోజులుపైగా డెంగీ బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భీమవరం ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారని, వేలల్లో, లక్షల్లో విపరీతంగా వైద్యానికి ఖర్చు పెడుతున్నారన్నారు. డబ్బులు లేక పేద, మధ్యతరగతి ప్రజలు అవస్తలు పడుతున్నారని వారికి వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కమిలి నాని, పిల్ల సూరి బాబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అభ్యంతరాలపై ప్రత్యేక క్యాంపులు

భీమడోలు : మండలంలో గతనెల 27వ తేదీ ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు ఈనెల 4, 5, డిసెంబర్ 2, 3వ తేదీలలో ప్రత్యేక క్యాంపులను బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఉంగుటూరు నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ తెలిపారు. మండల పరిధిలో పోలింగ్ బూత్ నెంబర్ 68 నుంచి 120 వరకు గల 54 పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలన నిమిత్తం ప్రదర్శించిన ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు 51,381 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 25,189 మంది పురుషులు, 26 వేల 192 మంది మహిళలు ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఇదే క్రమంలో ఓటర్ల జాబితాలో చేర్పుల కొరకు ఫారం-6, తొలగింపుల కోసం ఫారం-7, మార్పుల కోసం ఫారం-8లను పూర్తి చేసి ప్రత్యేక క్యాంపు సందర్భంగా నిర్వహిస్తున్న పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉన్న అధికారులకు అందజేయాలని తహశీల్దార్ కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సబ్‌ట్రెజరీ ఎటిఒకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ పెన్షనర్స్‌కు ప్రతీనెల ఒకటవ తేదీనే పెన్షన్ ఇవ్వాలని, డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏలూరు సబ్ ట్రెజరీ ఎటిఒ సత్యనారాయణకు ఎపి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు, నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు వినతిని సమర్పించారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు, నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు కోటదెబ్బ సబ్ ట్రెజరీ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి ఎటిఒకి వినతిని సమర్పించారు. 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సికి ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎపి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, కార్యదర్శి కె.మహాలక్ష్ముడు, కోశాధికారి డి.గంగాధర్, ఏలూరు నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఎ.అప్పలరాజు, ఎస్ఎంవి.సుబ్బారావు, ఎన్.ఏసు, బి.పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

ఏలూరు అర్బన్: అనేక పోరాటాలు, 32 మంది విద్యార్థి, యువకుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటు అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీను మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసే ఆలోచన విరమించుకోవాలని, విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలకు బంద్‌కు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్, ఐసా జిల్లా ప్రధాన కార్యదర్శి గరికె అఖిల్, పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు మంద క్రాంతి కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ చేసి ఆదానికి అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దానికి ముఖ్యమంత్రి వంతు పాడుతున్నాడన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాట కార్యక్రమాలు ఈనెల 8వ తేదీకి వెయ్యి రోజులవుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సమరశీల పోరాటానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తుర్లపాటి రాజు, శేఖర్, వరప్రసాద్, సాయిన బాలు, శివ, జి.నాగేంద్ర, మోహన్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల ప్రత్యేక నమోదు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారు వచ్చే డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లోనూ, డిసెంబర్ 2, 3 తేదీల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఆయా రోజుల్లో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. తుది ఓటర్ల జాబితా 2024 జనవరి 5న ప్రకటిస్తారన్నారు.

డిసెంబరు 16,17 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

నాల్గో పిల్లల సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంఎల్‌సి సాబ్జీ

పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - ఏలూరు

చిన్నారుల్లో దాగి ఉన్న వివిధ నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు వారిలో మానసికోల్లాసం, వికాసం పెంచేందుకు బాలోత్సవం ఎంతో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం హేలాపురి బాలోత్సవం నాల్గో పిల్లల సంబరాల పోస్టర్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఏలూరులో డిసెంబరు 16, 17 తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి చిన్నారీ వారి జీవితకాలమంతా ఈ అనుభవాలను వారి గుండెల్లో చెరగని ముద్రగా గుర్తుండేలా ఈ ఉత్సవాలను నిర్వహించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ డిసెంబర్ 16, 17 తేదీల్లో ఏలూరులోని శ్రీ సురేష్‌చంద్ర బహుగుణ (పోలీసు) స్కూలు వేదికగా నాల్గో హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు నగరం,రూరల్, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల నుంచి 400 స్కూళ్లకు చెందిన ఎల్‌కెజి నుండి పదో తరగతి విద్యార్థులను ఈ బాలోత్సవంలో పాల్గొనడానికి ఆహ్వానిస్తున్నామన్నారు. వ్యక్తిగత ప్రతిభ, ప్రదర్శన, విద్యార్థులకు అకడమిక్ కల్చరల్ ప్రతిభను వెలికితీసేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి విజిఎంఆర్.కృష్ణారావు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, నేతలు వై.ఆనందనాయుడు, శ్రీహరికోటి, ఎస్.కస్తూరిరావు, వి.సురేష్, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 132 అర్జీలు

జెసి లావణ్యవేణి

వినతులు స్వీకరిస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి - కామవరపుకోట

సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం(జెకెసి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కామవరపుకోటలో జెకెసి కార్యక్రమాన్ని స్థానిక శ్రీ చినరాజప్ప ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, ప్రత్యేక అధికారి ఎం.రాజు, డ్వామా పీడీ రాంబాబు, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా అధికారులు అంతా మండలస్థాయి జెకెసికి హాజరవ్వడం ద్వారా మండలస్థాయి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాలు, భూసమస్యలు, హౌసింగ్, తాగునీరు, విద్యుత్ సమస్యలు, సర్వే తదితర అంశాలపై మొత్తం 132 అర్జీలు అందాయని, వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. మండలస్థాయిలో నమోదైన అర్జీలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి నివేదికలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కడిమి రమేష్, యడవల్లి సర్పంచి పొన్నాల అనిత, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బిజెపిని ఓడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి, దాని స్నేహితులను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి స్పష్టం చేశారు. ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని, దానికి కొమ్ముకాసే పార్టీలను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సిపిఎం ఆధ్వర్యంలో గుర్తించామన్నారు. అసమానతలు లేని రాష్ట్రంగా అభివృద్ధి కావాలని కోరుతూ అందుకు అవసరమైన ప్రజా ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో జిల్లామీదుగా సాగే బస్సు యాత్రలు, బహిరంగ సభల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, నేతలు కె.శ్రీనివాస్, మహంకాళి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ప్రజారక్షణ భేరి ప్రచార కరపత్రాలను శుక్రవారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ విభజన హామీలు ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు తదితర అంశాలకు బిజెపి ప్రభుత్వం నీళ్లొదిలిందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట అనే ధైర్యం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి, నేతలు తామా ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరావు, కొయ్యల శ్రీను పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

ఆల్ ఇండియా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ ఆల్ ఎంప్లాయిస్, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలోని వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు శుక్రవారం ఢిల్లీలో సిపిఎస్ రద్దు కోరుతూ జరిగిన ర్యాలీలో ఏలూరు యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమానికి యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర రావు, వి.కనకదుర్గ, జిల్లా కార్యదర్శి కె.కమల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి.నరసింహారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కాంట్రాక్టర్‌ను తొలగించాలి : డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం : స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య కిరణ్ మాట్లాడుతూ ఇటీవల జంగారెడ్డిగూడెం జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వండి పెట్టాల్సిన మధ్యాహ్న భోజనం పథకం సరుకులను కాంట్రాక్టర్ అడ్డదారిలో తరలించడం సిగ్గుచేటన్నారు. సంబంధిత అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌ను తొలగించి, నిర్లక్ష్యంగా వున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే యువజన, ప్రజా, విద్యార్థి సంఘాల సమైక్యతతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ సభ్యులు రాజు, బి.కిషోర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో అవినీతిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సరుకులు పక్కదారి పట్టించడం హేయమైన చర్య అన్నారు. సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులైన డిఇఒ, కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని రామ్మోహన్ తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నూతనంగా విధులు స్వీకరించిన ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(ఎపిడి) డి.దామోదర్ రావు తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లిలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో, పాఠశాలల్లో నీళ్ల నిల్వ చేయడానికి మండలంవ్యాప్తంగా 20 కమ్యూనిటీ ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. దానికి సంబంధించిన సర్వే చేపట్టనున్నట్లు తెలియజేశారు.

'స్పందన'లో పిటిషన్‌పై విచారణ

మండలంలోని తాటియా కులగూడెంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందంటూ గతంలో పలువురు స్పందనలో ఫిర్యాదు చేయగా దానిపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారుని నుంచి వివరాలు సేకరించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గత ఎపిడి ప్రఫుల్, ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణ ప్రసాద్, ఎపిఒ జాన్ వెస్లీ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి : ఎంపిపి

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో భట్లువారిగూడెం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సొంతంగా వండిన వంటలను, పోష్టికాహారం, వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఉన్నవారు జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చి ఉచిత వైద్య సేవలు, మందులను ఉపయోగించుకోవాలని, అవసరమైన వారికి ఇసిజి కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్క కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సూపర్‌వైజర్ లీలా, సిడిపిఒ పి.మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, చిన్నారులకు పోష్టికాహారం అందించటంలో ఎక్కడా రాజీపడటం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు అత్యూరి సుబ్బారావు, జానారెడ్డి వివిధ సెంటర్ల అంగన్‌వాడీ టీచర్స్, వైద్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో పాల్గొన్న కమిషనర్ రాంబాబు

సంబంధిత ఫారాలు అందుబాటులో ఉంచాలి

చింతలపూడి : ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే వాటికి సంబంధించిన ఫారాలను అందుబాటులో ఉంచాలని చింతలపూడి తహశీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు. పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద బిఎల్‌ఒలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 4, 5 తేదీల్లో ఓటర్ల జాబితాపై స్పెషల్ క్యాంపెన్ జరుగుతుందన్నారు. అందరూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, ఎలక్షన్ డిటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంఇఒ-2లకు ఎలాంటి అధికారాలూ లేవు : ఎపిటిఎఫ్

ఏలూరు అర్బన్ : ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎంఇఒ-2లు ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే ఉన్నారని, వీరికి ఎలాంటి అధికారాలు లేకుండా చేయడం ద్వారా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను అవమానించినట్లుగానే భావించాల్సి వస్తుందని ఎపిటిఎఫ్-1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాంబాబు, గుంగులోతు కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే పంచాయతీరాజ్ పరిధిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ సంబంధిత అన్ని అధికారాలు ఎంఇఒ-2కు బదలాయించి తగు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'సచివాలయాల వ్యవస్థ దేశానికే ఆదర్శం'

టి.నరసాపురం : సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం పోలవరం నియోజకవర్గం పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు శనివారం మండలంలోని రేపల్లె వాడ రోటరీ క్లబ్ ఫంక్షన్ హాల్‌కి హాజరవుతున్నట్లు వైసిపి మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల ప్రజాప్రతినిధులకు ఎంఎల్‌ఎ దిశా నిర్దేశం చేస్తారని, మధ్యాహ్నం మూడు గంటలకు సభ ప్రారంభం అవుతుందని తెలిపారు.

జీలుగుమిల్లి : రాబోవు ఎన్నికల్లో మరలా వైసిపి ప్రభుత్వం విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విజ్జు.వెంకటేశ్వరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జీలుగుమిల్లి సొసైటీ ఆవరణలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు అందజేతకు ప్రణాళికలు సిద్ధం

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు వచ్చే సంవత్సరం జనవరిలోగా గృహాలు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎల్అండ్‌టి ఫైనాన్స్ హెడ్ రామకృష్ణ తెలిపారు. గృహాల వద్ద పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఎ వెంకట ప్రతాప్ అప్పారావు సహకారంతో 2,640 గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

నేరాలు - ఘోరాలు

నిందితులకు జ్యూడిషియల్ రిమాండ్

నూజివీడు రూరల్ : చెక్కు బౌన్స్ కేసులో కోర్టుకు హాజరుకాని ఇద్దరు వ్యక్తులకు జ్యూడిషియల్ రిమాండ్ విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పట్టణానికి చెందిన ఎం.లక్ష్మణరావు, మలావత్ దుర్గాప్రసాద్‌లు చెక్కుబౌన్స్ కేసులో కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయగా, వీరు కోర్టులో రీకాల్ పిటిషన్ వేశారు. వాటిని డిస్మిస్ చేసి కోర్టు రిమాండ్‌కు పంపింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రైలు బండి ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దఅవుటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నూజివీడు మండలం అదే ప్రాంతానికి చెందిన బలుగు అజయ్(24) యువకుడు రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలుబండి అతని ఢీకొంది. ఈ ఘటనలో అజయ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం : మహిళపై దాడి చేసిన నేరంపై వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగిశెట్టిగూడెం గ్రామానికి చెందిన 15 మంది జంగారెడ్డిగూడెంలోని ఫిన్‌కేర్ బ్యాంకు నందు లోన్ తీసుకున్నారన్నారు. ఆ గ్రూప్‌కు నులకాని రాధ లీడర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఈనెల 1వ తేదీ బుధవారం బ్యాంకు లోన్ కట్టాల్సి ఉన్నందున, గ్రూపు సభ్యురాలైన నల్లగోపుల కనకదుర్గను రాధ డబ్బులు అడిగిందన్నారు. రాధ డబ్బు తీసుకుని వస్తుండగా దారి మధ్యలో కనకదుర్గ భర్త వెంకటేశ్వరరావు అడ్డగించి, రాధను దూషిస్తూ, చేతులతో కొట్టి కిందపడేశాడన్నారు. ఈ ఘటనలో రాధకు గాయం అయ్యిందని, రాధ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళకు సంబంధించిన స్థలంలో పనులు చేసుకోనీయకుండా అడ్డగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన పులపర్తి వీర వెంకట జయలక్ష్మి నాగమణికి జంగారెడ్డిగూడెం మారుతీనగర్‌లో 623 చ.గజాల స్థలం వుంది. ఆ స్థలాన్ని శుభ్రపరిచేందుకు జెసిబితో ఆ స్థలం వద్దకు చేరుకోన్నారు. అదే ప్రాంతానికి చెందిన ఎస్‌కె దస్తగిరి, మరికొందరు కలిసి జెసిబిని అడ్డుకుని, నాగమణిని స్థలంలోకి రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో తనను స్థలంలోకి వెళ్లనీయకుండా దౌర్జన్యం చేస్తున్నారని, దస్తగిరిపై నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ముసునూరు : మా కుమార్తె కనిపించడం లేదు, ఆచూకీ తెలిపి మా కుమార్తెను అప్పగించగలరని కుమార్తె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన పల్లి రాంబాబు కుమార్తె పల్లి ప్రియాంక గురువారం రాత్రి 8 గంటల సమయంలో చర్చికి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు గురుకుల పాఠశాల ప్రారంభం

చింతలపూడి : డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను సాంఘీక సంక్షేమ శాఖామంత్రి మెరుగు నాగార్జున, వైసిపి జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని, ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ ప్రారంభిస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని మరో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొంటారని తెలిపారు. కావున ప్రతీఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు రూరల్ : కోర్టు భవనాల ప్రాంగణంలో డిసెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలతో సివిల్ కేసులు, పరిష్కరించదగిన క్రిమినల్, చెక్కు బౌన్సు కేసులు, వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, మనోవర్తి తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్ నందు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

వికలాంగులకు అండగా వైసిపి

పలువురికి ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్లు అందజేత

ఏలూరు టౌన్ : వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. శుక్రవారం ఎంఎల్‌ఎ చేతుల మీదుగా పలువురికి వీల్ ఛైర్లు, ట్రై సైకిళ్లు అందజేశారు. డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇన్‌ఛార్జిగా ఎస్‌సిలనే కేటాయించాలి

ముదినేపల్లి : నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా ఎస్‌సిలనే కేటాయించాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ సేవ నాగ జగన్ బాబురావు, రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షులు ఏసుపోగు దానియేలు కోరారు. ముదినేపల్లిలోని మాల మహానాడు, అనుబంధ సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఎస్‌సిలు ఉన్నటువంటి నియోజకవర్గం కైకలూరు నియోజకవర్గం అన్నారు. పార్టీ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా కైకలూరు నియోజకవర్గానికి ఎస్‌సిలను ఇన్‌ఛార్జిలుగా నియమించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు జక్కుల విజయకుమార్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జలకళ ద్వారా ప్రతి ఎకరాకూ సాగునీరు

ఏలూరు టౌన్ : వైఎస్ఆర్ జలకళ కార్యక్రమం ద్వారా రైతులకు ఉచిత బోర్లు వేసి ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడం జరుగుతోందని దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. పెదవేగి ఎండిఒ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ జలకళ ద్వారా అర్హులైన రైతులకు ఎంఎల్‌ఎ మోటార్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

జంగారెడ్డిగూడెం : మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ గౌరవ అధ్యక్షులు పి.సూర్యారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక ఆర్‌డిఒ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సోమేశ్వరరావుకి వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిని, యూనియన్ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతన భవనాలు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని నూతనంగా నిర్మించే భవనాలను వేగవంతం చేసి త్వరగా నిర్మించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ మండల శాఖాధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల, గోపవరం, ముసునూరులలో గ్రామ సచివాలయం, వేల్‌నేస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ఎంపిడిఒ జి.రాణీ, ఎఇ దుర్గాప్రసాద్, పంచాయతీ రాజ్ సిబ్బందితో కలిసి ఆయా భవనాలను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు

కొయ్యలగూడెం : మండలం చుట్టుపక్కల గ్రామాల్లో అకాల వర్షాలు పడడంతో ఒకటి, రెండు రోజుల్లో చేతికి రావలసిన వరి పంటలు నాశనం అయ్యాయని రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం రైతులు అన్ని విధాల నష్ట పోయామని, ఇంతకు నెల వర్షాలు లేక కరెంట్ కష్టాలతో వరి చేలు పొట్ట రాకుండానే గింజ కట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యత లోపించడంతో కాలుష్యం పెరిగి కాలక్రమం దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ముసునూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా మంచి నైపుణ్యం సాధించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు బిసి బాలుర హాస్టలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నాలుగు చెస్‌బోర్డు కిట్లు, వాలీబాల్ కిట్టు నెట్‌తో సహా అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధా పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఆగిరిపల్లి : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనిచేస్తుందని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని ఈదర గ్రామంలో రూ.16.70 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

మీర్జాపురం సొసైటీ వద్ద కళాజాతా

నూజివీడు రూరల్ : మండలంలోని మీర్జాపురం సొసైటీ వద్ద శుక్రవారం నాబార్డ్ సౌజన్యంతో కెడిసిసిబి ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కళాజాత బృందం జానపద గేయ రూపంలో రైతులకు కెడిసిసిబి ప్రవేశపెట్టిన రుణ పథకాలు గురించి వివరించారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి

భీమడోలు : గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న స్వామిత్వ సర్వే పారదర్శకంగా, త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలని సర్పంచి పి.సునీత మాన్సింగ్ కోరారు. ఈమేరకు భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, ఎంపిటిసి సభ్యులు ముళ్ళగిరి జాన్సన్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఇంతవరకు కొనసాగిన సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ సచివాలయాలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా పనిచేయనున్న నేపథ్యంలో సర్వే వివరాలు, దానికి అవసరమైన సమాచారం అందించే విషయమై కీలకంగా మారనున్నాయన్నారు. గ్రామ పరిధిలో ఇంతవరకు 4,446 నివాసాల వివరాలతో పాటు ఇతర అంశాలను సర్వే సందర్భంగా పరిశీలించి, నమోదు చేయనున్నామని, వివరాలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఇంతవరకు 40 శాతం నివాసాల సర్వే కార్యక్రమం పూర్తి అయిందని, వీరందరికీ ప్రభుత్వ రంగ నిర్ణీత సర్టిఫికెట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీలో కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత సర్వే కార్యక్రమాన్ని బాధ్యులు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో వివిధ డివిజన్లకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.15 లక్షల 51 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యంగా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలందరికీ కార్పొరేట్ తరహా వైద్యం అందించడంతోపాటు, ఆరోగ్య ఆసరా ద్వారా చికిత్సానంతర జీవన భృతిని సైతం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు చికిత్స చేయించుకున్న వారికి సైతం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయించిన ఆళ్ళ నానికి సదరు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన విద్యా సాఫల్య సర్వే పరీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో శుక్రవారం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాధికారి-2 భాస్కర్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలు పరీక్షా కేంద్రాలుగా, ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు సబ్జెక్టుల అంశాల వారీగా పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ పరీక్షలకు 23 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఆయా సబ్జెక్టులను చదువుతున్న 44 తరగతులకు చెందిన 1,040 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్‌కె.మస్తాన్ ఆధ్వర్యంలో మూడు, ఆరు తరగతులు చదువుతున్న విద్యార్థులకు పరీక్షలను నిర్వహించామన్నారు. పరీక్షలకు పర్యవేక్షకులుగా శిక్షణ పొందిన భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యవహరించారని తెలిపారు.

టి.నరసాపురం : విద్యార్థుల్లో దాగి వున్న విద్యా సామర్థ్యాలపై పరిశీలనకు సీస్ సర్వే నిర్వహిస్తున్నట్లు విద్యా శాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణిల పర్యవేక్షణలో సీస్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 3, 6, 9 తరగతులు చదివే విద్యార్థులకు 22 పాఠశాలల్లో 32 తరగతులకు 32 ఫీల్డ్ ఇన్విజిలేటర్ల సహాయంతో పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

నూజివీడు రూరల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే పరీక్షను నిర్వహించారు. విద్యావ్యవస్థలో తీసుకు వచ్చిన నూతన విధానాలకు సంబంధించి ఈసర్వే ప్రభుత్వం నిర్వహిస్తుంది. సర్వే పరీక్షను ఎంఇఒ-2 జమలయ్య పలు పాఠశాలలకు వెళ్లి పరిశీలించారు. రిసోర్స్ పర్సన్‌గా రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీగుత్తా శ్రీరామారావు ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీకలగర వెంకటరత్నం మహ్మద్ అస్లామ్ ట్రస్ట్, కలగర రత్తయ్య ట్రస్టు తరుపున ఆంగ్లం, రసాయన శాస్త్రంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన సర్ సిఆర్ రెడ్డి కళాశాలలకు చెందిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను శుక్రవారం స్థానిక సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ట్రస్ట్ మెంబర్ కాకరాల రాజేంద్ర వరప్రసాద్ సమక్షంలో అందజేశారు. మొదటిగా గుత్తా శ్రీరామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సర్ సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులకు, సర్ సిఆర్ రెడ్డి మహిళా కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థినులకు, ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు స్కాలర్‌షిప్, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే రసాయనశాస్త్ర విభాగంలో సర్ సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాలకు చెందిన విద్యార్థికి, సిఎస్‌సి విభాగంలో సర్ సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థికి గోల్డ్ మెడలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సర్ సిఆర్ రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డా.యమ్‌బిఎస్‌వి.ప్రసాద్, ట్రెజరర్ చిట్టూరి జానకిరామయ్య పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉషోదయ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఉషోదయ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చూపి ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోను అందుకోవడం అభినందనీయమని ఆ పాఠశాల డైరెక్టర్ గుణ్ణం బుల్లబ్బాయి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిమువ్వ సోషల్ సర్వీస్, ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో సిరిమువ్వ కూచిపూడి శాస్త్రీయ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. అందులో ఉషోదయ విద్యార్థినిలు బంటుపల్లి జ్ఞపద లక్ష్మీప్రసన్న, తాడేపల్లి స్పందన నృత్యాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రం, మెమెంటోలను అందజేసి సత్కరించారని గురువారం పాఠశాల అభినందన కార్యక్రమంలో బుల్లబ్బాయి పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలపై మక్కువ చూపుతున్న చిన్నారులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కలిదిండి

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి సాధ్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలిదిండి శాఖ మేనేజర్ శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అవినీతి నిర్మూలన - మన దేశ ప్రగతి కార్యక్రమం జరిగింది. అవినీతి రహిత సమాజానికి విద్యార్థి దశ నుండే సన్నద్ధం కావాలని ఆయన అన్నారు. అవినీతి రహిత సమాజం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ తేజ, ప్రధానోపాధ్యాయులు రాజమోహన్, బ్యాంక్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : అవినీతి రహిత సమాజ స్థాపన అందరి బాధ్యతని, అందులో అందరూ భాగస్వాములు కావాలని యూనియన్ బ్యాంక్ శ్రీహరిపురం శాఖ మేనేజరు బి.సురేశ్ అన్నారు. శుక్రవారం బ్యాంక్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పనికి లంచం ఇవ్వవలసిన అవసరం లేదని, పనిచేయించుకోవడం ప్రతి ఒక్కరి హక్కని, దానిని లంచంతో కొనవద్దని సూచించారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడు అవినీతి నిర్మూలన సాధ్యమని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి అవినీతిపరుడిని జవాబుదారీగా మార్చడం సమాజం విధి అన్నారు. అనంతరం సచివాలయం వద్ద సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ బీమాలను కలిగి ఉండాలని, బీమాపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజరు ఎస్.సాయిరాం, ఆర్‌డిఒ ఎన్.గోపి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు : టిడిపి

ముసునూరు : అధికారంలోకి రాగానే మద్యాన్ని నియంత్రిస్తామని మహిళల ఓట్లతోనే గద్దె నెక్కిన జగన్ నేడు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశాడని టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గుడిపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు పాల్గొన్నారు.

పోలవరం మట్టి కలశాలను ఢిల్లీ తరలింపు

పోలవరం : మండలంలో మేరా దేశ్ మేరా మిట్టి కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టిని ఢిల్లీకి తీసుకుని వెళ్లే మహత్తరమైన కార్యక్రమం తమకు అప్పచెప్పినందుకు పోలవరం సచివాలయం-3 సెక్రటరీ కె.శ్రీనివాస్ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

CHANGE OF NAME

I, Chityala Surendra Kumar, father of Chityala Karthikeya Varun Keshav, residing at 3-51-5/3, Subbaraopeta Tadepalligudem, submit that my son's name was wrongly shown as Chityala Kartikeya Varun Keshav in his old passport bearing number L1622366. All his other IDs and certificates bear the name as Chityala Karthikeya Varun Keshav. Hence for all practical purposes he shall be known as Chityala Karthikeya Varun Keshav.

అక్రమ కట్టడం తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ముదినేపల్లి : ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ప్రధాన ఆర్అండ్‌బి రహదారికి అడ్డంకిగా నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగింపచేశారు. వివరాల్లోకి వెళితే వడాలి - తామరకొల్లు ఆర్అండ్ బి రహదారులో మండలంలోని పెదకామనపూడి వద్ద గ్రామానికి చెందిన వ్యక్తి రహదారిని ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మించాడు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యపై గత నెల 22వ తేదీన ప్రజాశక్తిలో 'అక్రమ కట్టడం తొలగించాలంటూ' వార్త వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు గత నెల 25వ తేదీన ప్రధాన రహదారులో నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించారు. ఈ సమస్య పరిష్కారం కావడంతో ఇటు గ్రామస్తులు, అటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలి

నూజివీడు రూరల్ : హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం మిట్టగూడెం గ్రామంలో పెరటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ పెరటి తోటలు పెంచడం ద్వారా రసాయన రహిత ఊరగాయలను పండించవచ్చునని, తద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకానికి నమోదు చేసుకోవాలి

కొయ్యలగూడెం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం ఈనెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ ఓపెన్ అవుతుందని, దగ్గరలోని సిఎస్‌సి కామన్ సర్వీసు సెంటర్ లేదా, ఈ-సేవ వద్ద అర్హులు తప్పకుండా నమోదు చేసుకోవాలని శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం దేశ వ్యాప్తంగా గత సెప్టెంబరు 17వ తేదీ నుంచి అమలులో ఉన్నది కాబట్టి ఇతర రాష్ట్రాలలో లక్షల మంది ప్రజలు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎవరైతే దరఖాస్తు చేసుకుంటారో ఆ ఫ్యామిలీలో ఉన్న అందరి ఆధార్ నెంబర్‌లు మీ వద్ద ఉండాలని, పర్సనల్ బ్యాంకు అకౌంటు వుండాలని తెలిపారు.

అందని తాగునీరు

కొయ్యలగూడెం : కన్నాయిగూడెంలో గత మూడు, నాలుగు రోజుల నుంచి పంచాయతీ నీటి వ్యవస్థకు అంతరాయం కలిగింది. గ్రామంలో కొత్తపేటలో అయితే మంచినీరు దాదాపుగా వారం రోజుల నుంచి రావడంలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారు. సంవత్సరానికి మూడు సార్లు బోరు పాడవుతూ వస్తుంది. ఆ బోరు బావి పరింపూడి శివారులలో, కన్నాయిగూడెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఏదైనా సమస్య వస్తే దాన్ని పరిష్కరించడానికి జటిలం అవుతుంది. గ్రామ సెక్రెటరీనీ సంప్రదించగా బోరు మోటరు బాగా పాడవడంతో పరిష్కరించడానికి ఇబ్బంది అవుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలు సత్యసాయిబాబా ట్రస్ట్ ఏర్పాటు చేసిన గోదావరి మినీ ట్యాంకు ద్వారా ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 234/2023

బిట్వీన్:

బద్దా రత్నం ...వాది

మరియు

బొబ్బనపల్లి రామచంద్రరావు ...ప్రతివాది

టు: బొబ్బనపల్లి రామచంద్రరావు, తండ్రి: శ్రీను, C/o. బొబ్బనపల్లి చిన్నా, అక్కుపల్లి గోకవరం, ఉంగుటూరు మండలం, ప్రజెంట్ ఏలూరు జిల్లా. TPG PJCJ.

పై నెంబరు దావాలో కోర్టు వారిచే మీకు పలుమార్లు సమన్లు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీకు ఇందుమూలముగా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సమన్లు జారీ చేయడమైనది. ఇందుపై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి సమక్షములో **ది.17-11-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములను తెలుపుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున కోర్టు వారిచే తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 17-11-2023

వద్లాని తేజ

తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.

31-10-23. సెల్: 83330 83599

మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 273/2022

బిట్వీన్:

సంగాని శ్రీనివాసు ...వాది

VS

నాటిన శ్రీను ...ప్రతివాది

టు:

నాటిన శ్రీను, తండ్రి: ముత్యాలరాజు, డో.నెం. 1-103, ముక్కోటి రామాలయం వద్ద, పెదమైనవాని లంక, నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా NPJCJC

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ మీరు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ సారి సదరు ప్రతివాదికి అమలు జరగబోవు దావా సమన్లు Substituted Service By Way Of Publication ద్వారా అమలు జరిపించు నిమిత్తం ది.30-11-2023వ సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు వాయిదా తేదీ **ది.30-11-2023వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును. ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

(By Order Of The Court)

యు.సత్యనారాయణ

నర్సాపురం, అడ్వకేట్, నర్సాపురం.

03-11-23. ప॥గో॥జిల్లా.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814